# అన్నదానం చేయడం గొప్పవిషయం



గుర్రాలగొందిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- గుర్రాలగొందిలో అభయ ఆంజనేయస్వామి ఆలయ అన్నదాన భవనం ప్రారంభం



గుర్రాలగొందిలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ అన్నదాన భవనాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

నారాయణరావుపేట, మే 7: భారత సైనికులకు సలాం.. భరత మాతాకీ జై అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో అభయ ఆంజనేయస్వామి ఆలయ అన్నదాన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే హనుమాన్ స్వాముల భిక్ష కోసం మొట్టమొదటి అన్నదాన భవనం సిద్దిపేటలోనే ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మొట్టమొదటి అన్నదాన భవనం గుర్రాలగొందిలోనే ఉందన్నారు. అన్నిదానాలకన్నా అన్నదానం గొప్పదన్నారు. పెండ్లిళ్లు, బర్త్‌డేల సందర్భంగా అన్నదానం చేస్తే పుణ్యం వస్తుందని, భారత సైన్యానికి హనుమంతుడు ఆత్మస్థైర్యం,బలం ఇవ్వాలన్నారు. అమాయకులైన టూరిస్టుల మీద క్రూరంగా దాడిచేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య. మాజీ ఎంపీపీ బాలకృష్ణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీఎంపీటీసీ హరీశ్, అభయాంజనేయ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I హైదరాబాద్, గురువారం 8 మే 2025 SIDDIPET




సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఐకేపీ కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం

# ధాన్యం కొనుగోళ్లలో సర్కారు విఫలం

## సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- వడ్లు మొలకెత్తినా కొంటలేరు
- సిద్దిపేట జిల్లా రూరల్ మండలం ఇర్కోడు ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం పరిశీలన



సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఐకేపీ కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఐకేపీ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, మే 7: ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ సీఎం రేవంత్‌రెడ్డికి అన్నదాతలపై లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా రూరల్ మండలం ఇర్కోడులోని ఐకేపీ కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి నుంచే కలెక్టర్, ఆర్డీవో, సివిల్‌సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి పాలన చేతకాకపోతే దిగిపోవాలని హితవు పలికారు. నేడు రాష్ట్రంలో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఉందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనేదిక్కులేక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. హైదరాబాద్‌లో కూర్చొని అందాల పోటీలపై రేవంత్‌రెడ్డి సమీక్షలు చేస్తున్నాడని, అన్నదాతల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అప్పులు పుట్టడం లేదని మాట్లాడటం అంటే సీఎంగా ఫెయిల్ అయ్యారనే అర్థమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం గన్నీ బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో లేదన్నారు. రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు తగ్గించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించి సమస్యలు పరిష్కరించాలన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్లలో కరోనా వచ్చినా, నోట్ల రద్దు అయినా ఏరోజు కూడా రైతులకు రైతుబంధు ఆపలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ధాన్యం కొనుగోలులో ఎన్నడూ ఇంత ఆలస్యం జరగలేదని, కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం రైతుల నుంచి తరుగు పేరుతో 5కేజీల ధాన్యం కట్ చేస్తుందని మండిపడ్డారు. కొనుగోలు చేయడంలో ఆలస్యంకావడం వల్ల వర్షాలు పడి ధాన్యం మొలకెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు వర్షాలకు దెబ్బతిన్న కూరగాయలు, మామిడి పంటలు వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే 43సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. మంత్రుల గాలిమోటర్ల ప్రయాణాలు తప్పా ఏం సాధించారో చెప్పాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు పర్యటించాలని సూచించారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, నాయకులు విజేందర్‌రెడ్డి, చిట్యాల సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

# అర్హులకే ప్రభుత్వ పథకాలు



సిద్దిపేటలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, మే 7: అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధతో కలిసి జిల్లాలో అకాల వర్షాల వల్ల పంట నష్టం, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచితంగా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ కిరణం తదితర పథకాలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వానికి చెడ్డపేరు రావద్దన్నారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసేలా చూడాలన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పంటల నష్టం వివరాలను త్వరగా ప్రభుత్వానికి పంపించాలని అధికారులకు సూచించారు. ఆయిల్‌పామ్ పంట రైతులకు వరమని, జిల్లాలోనే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతున్నందున వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్ శాఖల అధికారులు రైతులను ఒప్పించి ఆయిల్‌పామ్ సాగుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, ఇంజినీరింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. టెన్త్, ఇంటర్‌లో 90 శాతం పైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు వేదిక ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్, మట్టి పాత్రలు, కుండలు ఉపయోగించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. సిద్దిపేట అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలి

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుకునూర్‌లో రైతుల ధర్నా



వెల్దుర్తి- నర్సాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న కుకునూర్ రైతులు

వెల్దుర్తి, మే 7. ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతులు నిరసన చేపట్టారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని కుకునూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గత నెల 16న ప్రారంభించి ఇప్పటివరకు తూకం వేయకపోవడంపై బుధవారం కుకునూర్ చౌరస్తా వద్ద రైతులు వెల్దుర్తి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వం హమాలీలు రావడం లేదనే సాకుతో ధాన్యం తూకం వేయడం లేదని మండిపడ్డారు. ఎప్పు డు కురుస్తుందో తెలియని అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారు లు స్పందించి ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాలలక్ష్మి, సొసైటీ చైర్మన్ అశోక్, ఆర్‌ఐ నర్సింగ్‌యాదవ్ రైతుల వద్దకు చేరుకున్నారు. ధాన్యం తూకం ప్రారంభిస్తామని హామీనివ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం కుకునూర్ కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సందర్శించి గురువారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని, సీరియల్ ప్రకారం ధాన్యం తూకం వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీలు లేకుంటే ట్రాక్టర్ల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలని ఆమె సూచించారు.

# రెవెన్యూ సదస్సు వేదికపై కాంగ్రెస్ లీడర్లు

- అధికారులకు సమానంగా కుర్చీల కేటాయింపు
- మంత్రి పొన్నం క్యాంపు కార్యాలయం నుంచి ఆదేశాలు?
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు




సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు వేదికపై కూర్చున్న కాంగ్రెస్ నాయకులు



తహసీల్దార్ పక్కన కూర్చున్న కాంగ్రెస్ నాయకుడు, సింగిల్ విండో వైస్ చైర్మన్, ఎగ్గిడి అయిలయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు పరశురాములు

అక్కన్నపేట, మే 7: ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేసి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ సదస్సులకు కాంగ్రెస్ నాయకులు హాజరై వేదికపై అధికారులకు సమానంగా కూర్చుంటున్నారు. ఇది చూసినా స్థానికులు కాంగ్రెస్ సభనా... రెవెన్యూ సదస్సా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేదికపైన అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఉండటంతో భూసమస్యల గురించి అధికారులకు వివరించేందుకు కూడా బాధిత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తమకు, పార్టీకి వ్యతిరేకంగా ఉన్న రైతుల దరఖాస్తులు, భూ సమస్యల గురించి అధికారులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు తప్పుడు సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### 37 గ్రామ పంచాయతీలు.. మూడు రెవెన్యూ టీంలు..

భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేశారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల తహసీల్దార్లు అనంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేఖ ఆధ్వర్యంలో మూడు రెవెన్యూ టీంలను ఏర్పాటు చేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి భూ సంబంధిత సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రెవెన్యూ సదస్సులను హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి రోజువారీగా పర్యవేక్షిస్తున్నారు.

### మంత్రి క్యాంపు ఆఫీసు నుంచి ఆదేశాలు?

అక్కన్నపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేయడంతో రెవెన్యూ సదస్సులకు కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యనాయకులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో మండలంలోని మూడు రెవెన్యూ టీంల ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు ఆయా గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు వెళ్లి అధికారుల పక్కకు కూర్చుంటున్నారు. దీంతో అధికారులతో పాటు నాయకులు కూడా వేదికపై ఉండటంతో భూ సమస్యలు చెప్పేందుకు కొందరు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల కాంగ్రెస్ నాయకుల ఇంట్లో వంటచేయడంతో మధ్యాహ్నం అధికారులు వారి ఇండ్లకు వెళ్లి భోజనాలు చేస్తున్నట్లు తెలిసింది.

# లారీల కొరత లేకుండా చూడాలి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



సిద్దిపేట మార్కెట్ యార్డులో తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, మే 7: ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా చూడాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి ప్రస్తుతం ఎన్ని ట్రక్కుల ధాన్యం రవాణాకు సిద్ధంగా ఉందని, వర్షాలతో ధాన్యం ఏమైనా తడిసిందా అని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. అకాల వాన వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపుతున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతం రాగానే తూకం వేసి మిల్లులకు పంపాలన్నారు. రైతులకు త్వరగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్న 500 టార్పాలిన్లు ధాన్యం తడవకుండా ఉపయోగించాలన్నారు. అదనంగా రెండు ప్యాడీ క్లీనర్లు సమకూర్చుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, లారీల కొరత రాకుండా పర్యవేక్షించాలని సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీంని ఆయన ఆదేశించారు.

# పాతాళానికి గంగ

- సంగారెడ్డి జిల్లాలో అడుగంటిన భూగర్భ జలాలు
- 15.47 మీటర్లకు పడిపోయిన నీటి మట్టం
- వ్యవసాయం, తాగునీటి బోర్లపై ప్రభావం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సంగారెడ్డి జిల్లా హత్నూర శివారులో సన్నగా నీళ్లు పోస్తున్న వ్యవసాయ బోరు

సంగారెడ్డి మే 7(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి భూగర్భజలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం భూగర్భజలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. భూగర్భజల శాఖ ప్రతినెలా భూగర్భజలమట్టాలను సేకరిస్తుంది. భూగర్భజలశాఖ నివేదిక అనుసరించి గతనెల చివరి వరకు సంగారెడ్డి జిల్లాలో భూగర్భజలమట్టాలు 15.47 మీటర్లకు చేరుకున్నాయి. ఫిబ్రవరిలో 12.57 మీటర్లు లోతులో ఉండగా మార్చిలో 14.79 మీటర్లకు పడిపోయాయి. గతేడాది ఏప్రిల్‌తో పోల్చి చూస్తే జిల్లాలో 1.97 మీటర్ల లోతుకు భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో జిల్లాలో తాగు, సాగు నీటి ఇబ్బందులు పెరుగుతున్నాయి. భూగర్భ జలమట్టాలు తగ్గడంతో వ్యవసాయబోర్లు సాగునీటిని ఆశించిన స్థాయిలో పోయడం లేదు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయబోర్ల నుంచి తక్కువగా నీళ్లు వస్తున్నాయి. దీంతో పంటలకు సాగునీరు సరిపోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కూరగాయలసాగు చేస్తు న్న రైతులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలమట్టాలు తగ్గటంతో తాగునీటి బోర్లు ఎండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తక్కువగా నీళ్లు పోస్తున్నాయి. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని చాలా గ్రామాలు, తండాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. దీనికి తోడు గ్రామంలోని తాగునీరు సరఫరా చేసే బోర్ల నుంచి నీళ్లు రావటం లేదు. భూగర్భజలాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు కొత్త బోర్లు వేసేందుకు జంకుతున్నారు.

### కంగ్టి మండలంలో...

సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి మండలంలో (అత్యంత లోతుకు) భూగర్భజలాలు 27.78 మీటర్లకు చేరుకున్నాయి. హత్నూర మండలంలో భూగర్భ జలమట్టాలు 24.30 మీటర్లు, నిజాంపేటలో 22.16, కల్హేర్‌లో 21.65, కొండాపూర్‌లోని ఆర్‌సీపురంలో 19.27, సంగారెడ్డిలో 18.64, గుమ్మడిదలలో 17.83, పటాన్‌చెరులో 17.68, చౌటకూరులో 16.95, పుల్కల్‌లో 15.53 మీటర్లలోతులో భూగర్భ జలమట్టాలు ఉన్నాయి. జహీరాబాద్ మండలంలో 14.59 మీటర్లు, కోహీర్‌లో 14.26, కందిలో 13.83, అందోల్‌లో 13.52, మొగుడంపల్లిలో 13.19, జిన్నారంలో 13.03, సిర్గాపూర్‌లో 12.84, సదాశివపేటలో 11.97, జిన్నారంలో 11.36, న్యాల్‌కల్‌లో 10.10, నాగల్‌గిద్దలో 8.19. మనూరులో 7.86, మునిపల్లిలో 7.70, రాయికోడ్‌లో 7.48, వట్‌పల్లిలో 7.64 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. రామచంద్రాపురం మండలంలో అత్యంత పైన 3.80 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయి. వేసవి నేపథ్యంలో మే చివరినాటికి భూగర్భ జలాలు మరింత లోతుకు పడిపోయే అవకాశం ఉంది.

# 'దిశ' సమావేశానికి కాంట్రాక్టర్, కన్సల్టెంట్

## ఉన్నతాధికారులకు బదులు ఇద్దరు హాజరు.. అధికారుల తరహాలోనే సమాధానాలు

- రెవెన్యూ అధికారులతోనే భూసేకరణ జాప్యం జరుగుతున్నట్లు వెల్లడి
- ఇద్దరు హైవే అథారిటీ అధికారులుగా భావించి వివరణ ఇచ్చిన ఆర్డీవో
- సమీక్ష చివరలో బయటపడ్డ అసలు నిజం, బిత్తరపోయిన అధికారులు
- ఎంపీల ఆగ్రహంతో సమావేశం నుంచి వెళ్లిపోయిన కాంట్రాక్టర్, కన్సల్టెంట్
- సంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



నేషనల్ హైవే అధికారులకు బదులుగా దిశ సమావేశానికి హాజరైన కాంట్రాక్టర్, కన్సల్టెంట్

సంగారెడ్డి మే 7(నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అందించడంలోనే కాదు అధికారిక సమావేశాల నిర్వహణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అవుతున్నది. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం నిర్వహించిన 'దిశ' సమీక్షా సమావేశం ఇందుకు ఉదాహరణ. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన 'దిశ' సమావేశానికి నేషనల్ హైవే కాంట్రాక్టర్, కన్సల్టెంట్ హాజరు కావడం కలకలం రేపింది. ఉన్నతాధికారుల తరహాలోనే సమావేశానికి హాజరుకావడమే కాకుండా ఎంపీలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అంతటితో ఆగకుండా నేషనల్ హైవేల నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ జాప్యం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఫిర్యాదు చేశారు. దీంతో ఖంగుతున్న రెవెన్యూ అధికారులు ఎంపీలకు వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. నేషనల్ హైవేల నిర్మాణంపై సమీక్ష చివర వరకు సమావేశంలో మాట్లాడింది ఇద్దరు ఉన్నతాధికారులు కాదని కాంట్రాక్టర్, కన్సల్టెంట్ అని తేలడంతో సమావేశానికి హాజరైన వారంతా బిత్తరపోయారు. ఎంపీలు జిల్లా అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడునెలలకు ఒకసారి నిర్వహించే దిశ సమావేశానికి కాంట్రాక్టర్, కన్సల్టెంట్ ఎలా వస్తారని ప్రశ్నించారు. సమావేశం నుంచి వెంటనే వెళ్లిపోవాలని ఎంపీలు కాంట్రాక్టర్, కన్సల్టెంట్‌ను ఆదేశించారు.దీంతో వారు పలాయనం చిత్తగించారు.

### తామే అధికారులమన్న తరహాలో వ్యవహరించి...

కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమీక్షించేందుకు దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. ఎంపీలు సురేశ్‌షెట్కార్, రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలోనే ఎంపీలు నేషనల్ హైవేల నిర్మాణంపై సమీక్షించారు. సమావేశానికి నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ హాజరు కావాల్సి ఉండగా ఆయన కార్యాలయం తరపున కన్సల్టెంట్ సంజయ్ డోంగ్రే, కాంట్రాక్టర్ నాగరాజు హాజరుయ్యారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీలు పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు హైవే నిర్మాణం, సంగారెడ్డి నియోజకవర్గంలోని పెద్దాపూర్ వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీస్‌రోడ్డు నిర్మాణంలో ఎందుకు జాప్యం అవుతుందని ప్రశ్నించారు. దీనికి అధికారుల తరహాలోనే కన్సల్టెంట్, కాంట్రాక్టర్ మైకు తీసుకొని మాట్లాడారు. నేషనల్ హైవే అథారిటీ వైపు జాప్యం ఏమీలేదని భూసేకరణలో రెవెన్యూ అధికారుల జాప్యం వల్లనే పనులు వేగంగా సాగడంలేదని తెలిపారు. దీనికి సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి వివరణ ఇస్తూ సర్వీసు రోడ్డ నిర్మాణం కోసం సేకరించాల్సిన భూమిలో ప్రార్థనాస్థలం ఉందని అందుకే జాప్యం జరుగుతుందని వివరణ ఇచ్చారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ హైవేల నిర్మాణం కోసం ప్రార్థనా మందిరాలను తొలిగించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయన్నారు. ప్రార్థనామందిరాల భూమిని సేకరించి వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇదే క్రమంలో ఎంపీలు నేషనల్ హైవే అథారిటీ రహదారుల నిర్మాణంపై ప్రశ్నలు అడుగుతున్న క్రమంలో అప్పటి వరకు మాట్లాడుతూ వచ్చిన సంజయ్ డోంగ్రో, నాగరాజు నేషనల్‌హైవే అథారిటీ అధికారులు కాదని ఒకరు ప్రైవేట్ కన్సల్టెంట్ కాగా మరొకరు నేషనల్ హైవే నిర్మాణం పనులు చేపట్టే కాంట్రాక్టర్‌గా గుర్తించారు. వెంటనే ఇద్దరినీ సమావేశం నుంచి బయటకు పంపించి వేశారు. దీంతో ఎంపీలు జిల్లా అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన సమావేశంలో అధికారులు పాల్గొనాల్సి ఉండగా కన్సల్టెంట్, కాంట్రాక్టర్ ఎలా పాల్గొంటారని అసహనం వ్యక్తం చేశారు.